క్లుప్తంగా

విద్యుత్ స్తంభాలకు క్లాంపుల ఏర్పాటు


విద్యుత్ స్తంభానికి అమర్చిన క్లాంప్

సాక్షి ఎఫెక్ట్..

కోటవురట్ల: విద్యుత్ స్తంభాల ఏర్పాటులో ఆ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా పొంచి ఉన్న ప్రమాదాన్ని వివరిస్తూ 'సాక్షి'లో ఆదివారం వెలువడిన 'ప్రమాదస్థితిలో విద్యుత్ స్తంభాలు' కథనానికి ఆ శాఖాధికారులు స్పందించారు. ఆక్సాహేబుపేటలో విద్యుత్ స్తంభాలకు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన స్తంభానికి క్లాంపులు అమర్చకపోవడంతో వర్షాలకు అవి నేల కొరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో అక్కడున్న ప్రమాదకర స్థితిని వివరించడంతో అధికారులు నివారణ చర్యలు తీసుకున్నారు. హుటాహుటిన ఆదివారం స్తంభాలకు క్లాంపులు అమర్చడంతో స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా నవదుర్గ ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో నవదుర్గ అమ్మవారు

రాంబిల్లి: మండలంలోని కట్టుబోలు గ్రామంలో ఆదివారం నవదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు . మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కట్టుబోలు తదితర గ్రామాల నుంచి భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు భజనలు చేశారు.

విస్తారంగా మిరప సాగు


గవరపాలెంలో మిరప పంట

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మిరప పంట విస్తారంగా సాగవుతోంది. ప్రధానంగా సాగు నీటి వసతి కలిగిన పొలాల్లో ఈ పంట వేశారు. పంటకు ప్రతీ పది రోజులకు నీటి తడుపు అందించడం వల్ల మొక్క నాటిన 45 రోజులకు పంట కోత దశ ప్రారంభమవుతుంది. తక్కువ పెట్టుబడితో రెండు నెలల్లోనే మంచి దిగుబడి సాధించవచ్చు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేశాయని రైతులు చెబుతున్నారు. మండలంలో సింగన్నదొరపాలెం, పిండ్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శృంగవరం, పాతవలస, కె.కె.అగ్రహారం, కె.సంతపాలెం గ్రామాల్లోని 140 ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నారు.

నేడు వడ్డాదిలో నీలకంఠేశ్వరస్వామి కల్యాణం


నీలకంఠేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో వెలిసిన ఉమాగౌరీ నీలకంఠేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాసవర్మ, సోమేష్‌కుమార్ తెలిపారు. పురాతన కాలం నాటి శివాలయంలో స్వామివారి కల్యాణాన్ని ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. రాత్రి ఏడున్నర గంటలకు ఇక్కడ మండపంలో నిర్వహించే కల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈవో శర్మ, ఆలయ సిబ్బంది కోరారు.

శిథిల వంతెనలతో సమస్యలు


అరట్లకోట గ్రామం వద్ద ఉన్న ఇరుకు మదుం


శిథిలావస్థకు చేరుకున్న గోపాలపట్నం ఆవ వద్ద గల బ్రిడ్జి

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు, పాదచారులు
- సమస్య పరిష్కారానికి అధికారులకు వినతి

పాయకరావుపేట : మండలంలో గల పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ఇరుగ్గా ఉండటంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన పాయకరావుపేట నుంచి సముద్ర తీరానికి వెళ్లే అరట్లకోట మదుం, గోపాలపట్నం ఆవ వద్ద నున్న వంతెన (ఆవ పైన బ్రిడ్జి) ఇరుగ్గా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అలాగే ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవటంతో ప్రయాణాలకు వీలుగా లేకుండా ఉంది. రాత్రీపగలు ఇక్కడ పెద్ద సంఖ్యలో వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. పాయకరావుపేట నుంచి పెంటకోట సముద్ర తీరం వరకు వున్న 15 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. అరట్లకోట పంట కాలువపై గల ఈ మదుం ఎప్పుడో పూర్వ కాలంలో నిర్మించినది. అప్పటి నుంచి ఈ మదుంను వెడల్పు చేయలేదు. ప్రస్తుతం వాహనాల రద్దీ పెరగడం, అధిక బరువుతో ట్రాక్టర్లు, లారీలు ఈ మదుం మీదుగా శిథిలావస్థకు చేరుకున్న గోపాలపట్నం ఆవ బ్రిడ్జి ద్వారా రవాణా సాగించడం వలన వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విధంగా ఇరుగ్గా మదుం.. శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి వల్ల పాయకరావుపేట నుంచి అరట్లకోట, మంగవరం, పెద్దిపాలెం, గోపాలపట్నం, గునిపూడి, పెంటకోట సముద్ర తీరాలకు వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఇరుగ్గా వున్న అరట్లకోట మదుంను వెడల్పు చేయాలని, గోపాలపట్నం ఆవ వద్ద వంతెనను పునర్నిర్మించాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించి.. మదుం వెడల్పు చేయాలి



పాయకరావుపేట నుండి మంగవరం, గోపాలపట్నం వెళ్లే రోడ్డుకి అరట్లకోట గ్రామం వద్ద ఉన్న ఇరుకు మదుంను వెడల్పు చేయాలి. ఆవ వద్ద ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. దానికి మరమ్మతు చేపట్టాలి. అప్పుడే వాహన చోదకులు.. పాదచారులు సులువుగా ప్రయాణం చేయగలరు. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కట్టా వీరబాబు, మంగవరం

'మాఊళ్లో గ్రంథాలయం' కమిటీ అధ్యక్షుడిగా ధనశ్రీను


మా ఊళ్లో గ్రంథాలయం కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

మునగపాక: మండలంలోని మంగళవరపుపేటలో గల 'మాఊళ్లో గ్రంథాలయం' నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా భీశెట్టి ధన శ్రీను, కార్యదర్శిగా యల్లపు సంజీవరావు, ఉపాధ్యక్షుడిగా గొల్లవిల్లి సత్తిబాబు, కోశాధికారిగా ఆడారి అప్పలనాయుడు, గౌరవ అధ్యక్షుడిగా ఆడారి దక్షిణామూర్తి, డైరెక్టర్లుగా యల్లపు నాగమణి, ఆడారి సునీత, ఆడారి ధనలక్ష్మి, భీశెట్టి తులసి, ఆడారి కనక తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భగా అధ్యక్షుడు ధనశ్రీను మాట్లాడుతూ మా ఊళ్లో గ్రంథాలయం విద్యాభివృద్ధికి తోడ్పాటు నిస్తుందన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ మాఊళ్లో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్లాత్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో పెద్దలు మొల్లేటి సత్యనారాయణ, ఆడారి అబ్బాయినాయుడు, ఆడారి బుచ్చిరాము, ఆడారి రామకృష్ణ, భాస్కరరావు, గ్రంథాలయం సహాయకులు జగ్గప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడి ఆలయ నిర్మాణంలో భాగం కండి


మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: మునగపాకలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో జన్మించి వ్యాపార, ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన పలు కుటుంబాలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుడి ఆలయాన్ని అందరి భాగస్వామ్యంతో నిర్మించేందుకు కంకణం కట్టామన్నారు. ప్రతి ఒక్కరూ విరాళాల రూపంలో సాయం అందించాలని కోరారు. మన ప్రాంత వాసుల కల నెరవేరేందుకు తమకు తోచిన సాయం అందించి ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట ఉమేష్, ఆడారి కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, కొయిలాడ దశావతారం, ఆడారి దానకర్ణ, వెలగా రాజు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


స్వామిని దర్శించుకుంటున్న నాయకులు


అన్నసమారాధనలో భక్తులు

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లి ముత్రాసు కాలనీలో కొలువైన అభయాంజనేయ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి జయంతిలో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

భానుడి భగభగలు


నిర్మానుష్యంగా మునగపాక మెయిన్ రోడ్డు

మునగపాక: మండలవ్యాప్తంగా ఆదివారం ఎండ తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రుతుపవనాలు వచ్చేశాయంటూ ప్రచారం జరిగినా.. వేడి మాత్రం తగ్గడం లేదు. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడ్డారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తగ్గకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. మునగపాక మెయిన్ రోడ్డు ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారింది. అత్యవసర పనులున్న వారు మాత్రం తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం సాగించారు. జూన్ మూడో వారం కొనసాగుతున్నా ఎండలు తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారనడంలో సందేహం లేదు.

హిందూ మత సమ్మేళనాన్ని విజయవంతం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జైహో నాయకులు

కోటవురట్ల: ద్వేషం, అసమానతల నిర్మూలనకు ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న హిందూమత సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జైహో రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. కైలాసపట్నంలోని శ్రీరాజగోపాలస్వామి ఆలయం వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. జైహో ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్యూరాలిటీ అండ్ ఈక్వాలిటీ (హెచ్‌పీఈ) సంయుక్తంగా సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశాల భావాలు కలిగిన హిందూ మతాన్ని ఒక సంకుచిత చట్రంలో ఇరికించేందుకు కొన్ని మతోన్మాద సంస్థలు, వ్యక్తులు నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బహుళత్వం, ఏకత్వ భావనకు హిందూమతం జీవనాడిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, జైహో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి వెంకట్రావు, అర్చకులు వి.వి.సత్యనారాయణమూర్తి, నాయకులు కోన బాబూరావు, సత్యనారాయణ, రాజబాబు, అనిల్, వంశీ, వెన్నెల పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించాలి


హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు


హోంమంత్రి అనితకు మొక్క అందజేస్తున్న సీఐ బుచ్చిరాజు

ఎస్.రాయవరం: ఉపాధ్యాయ వృత్తి నుంచి హోం మంత్రిగా ఎదిగిన వంగలపూడి అనిత ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నేతలు కోరారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనితను అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు బోడిశెట్టి సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక..

ఎస్. రాయవరం: పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడ్డాక తొలిసారి ప్రాధాన్యత కలిగిన హోం మంత్రి పదవి వంగలపూడి అనితకు ఇవ్వడం అభినందనీయమని నీతి ఆయోగ్ బృందంలో పని చేసిన విద్యావేత్త కొయిలాడ కమల్ అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన స్థానిక టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధంతో కలిసి హోంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

హోం మంత్రికి స్వాగతం పలికిన సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనకాపల్లి విచ్చేసిన ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న మహిళల ధర్నా


పెదకలవలాపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న మహిళా రైతులు, కూలీలు

రాంబిల్లి: పెదకలవలాపల్లిలో మహిళా రైతులు, కూలీలు నిర్వహిస్తున్న ధర్నా ఆదివారం కొనసాగింది. అటవీ భూముల చుట్టూ నేవీ నిర్మిస్తున్న ప్రహరీ గోడ కారణంగా దశాబ్దాల కాలంగా తమ సాగులో ఉన్న భూములు కోల్పోయామని, తమ పంట పొలాల్లోకి వెళ్లే దారులు మూతబడుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి ధర్నా చేస్తున్నామని, తమ ఇబ్బందులను అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

- ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి చినకన్నబాబు


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చినకన్నబాబు, జిల్లా అధ్యక్షుడు రమణ


నూతనంగా ఎంపికైన పాలకవర్గ సభ్యులు

దేవరాపల్లి: అవినీతి రహిత సమాజ నిర్మాణమే తమ ధ్యేయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి చినకన్నబాబు, జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అన్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అధ్యక్షతన ఆదివారం దేవరాపల్లిలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.త్రినాథరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ, నర్సీపట్నం మండలాధ్యక్షుడు ఎండీ.ఎ. అన్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఏ.వలి తదితర జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల పాలకవర్గం సభ్యుల ఎంపిక జరిగింది. మండల అధ్యక్షుడిగా పోతల చిన అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా రొంగలి సత్యం, ట్రెజరర్‌గా బడబుళ్ల సత్యం, ఉపాధ్యక్షుడిగా డి. వెంకటపతిరాజు, సహాయ కార్యదర్శులుగా రంధి వెంకటరావు, గంగవంశం సంతోష్, గంగవంశం రజనీ, సిహెచ్. పెద్దినాయుడు, గండిపడాల మధులను సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు, విద్యార్థులకు యువతకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయడంతోపాటు షెడ్యూల్ ప్రకారం గ్రామాలలో సభల నిర్వహణకు కృషి చేయాలని నూతన సభ్యులకు సూచించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

- ప్రజారోగ్యంపై అధికారుల దృష్టి
- శరవేగంగా పూడికతీత పనులు.. కాలువల పరిశుభ్రం


రమణయ్యపేటలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

నక్కపల్లి: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రుతుపవనాల రాక సందర్భంగా అడపా దడపా వర్షాలు పడుతున్నాయి. దీంతో గ్రామాల్లో కాలువలు, వీధి రోడ్లపై చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. దాదాపు రెండు నెలల పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పంచాయతీ సిబ్బంది ప్రజారోగ్యంపై దృష్టి సారించ లేదు. దీనికి తోడు ఇటీవల వర్షాలు పడి కాలువలు, వీధుల్లో ఎక్కడికక్కడ అపారిశుధ్యం పేరుకుపోయింది. అయినప్పటికీ పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కాలువల్లో మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త వేయడంతో వీధులన్నీ అధ్వానంగా మారాయి. ఈ నేపథ్యంలో మండల అధికారుల ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు, సచివాలయ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి సారించారు. గడచిన రెండు రోజుల నుంచి నక్కపల్లి, రమణయ్యపేట, గుల్లిపాడు, ఉద్దండపురం, రేబాక, చందనాడ, నర్సాపురం తదితర గ్రామాల్లోని కాలువల్లో పూడిక తీస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. కాలువలు, బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని, ఊడ్చిన చెత్త, ప్లాస్టిక్ సామాన్లు, ఖాళీ అయిన వాటర్ బాటిళ్లను కాలువల్లో వేయొద్దని ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో వాటి పరిసరాల్లో కూడా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే ప్రక్రియ జరుగుతోంది. ఉపాధి హామీ పనులు జరగడంతో జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే మెయిన్‌రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించినట్లు తెలిపారు. బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో బ్లీచింగ్ జల్లించి క్లోరినేషన్ చేయించాలని ఆదేశించామన్నారు. కాలువలను ఆనుకుని ఉన్న తాగునీటి పైపుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపాం అన్నారు. బావులు, బోర్ల వద్ద ప్లాట్‌ఫారాలు లేకపోతే నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయనున్నామన్నారు. సురక్షితమైన తాగునీరు సరఫరా చేయడంతో పాటు వీధుల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు చేరుస్తామన్నారు. అక్కడ తడిపొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేయించాలని కార్యదర్శులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

మాడుగుల రూరల్: వర్షాకాలంలో పశువులకు గాలికుంటు రాకుండా టీకాలు వేస్తున్నామని మాడుగుల ఏరియా పశు వైద్య సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు ఆదివారం తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు ఈ టీకాలు వేయడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. ఇంతవరకు 828 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. ప్రతి రైతు పశువులకు వేయించాలని సూచించారు.

విలువలతో కూడిన విద్యే లక్ష్యం


రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: సూపర్ – 60 కార్యక్రమం ద్వారా 9, 10 తరగతుల విద్యార్థులు నైపుణ్యాలు, విలువలతో కూడిన విద్యనభ్యసించాలని సృజనవాణి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త కె. జానీ పేర్కొన్నారు. వీరవల్లి అగ్రహారం వద్ద సృజనవాణి సంస్థ కార్యాలయంలో ఆదివారం సూపర్-60 కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ రెండు సంవత్సరాలుగా 9, 10, విద్యార్థులకు నైపుణ్యాలు, విలువలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏడాదికి 40 రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా రెండో శని, ఆదివారాలతోపాటు సంక్రాంతి, దసరా, వేసవి సెలవుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సిరి ఫౌండేషన్ సహకారంతో రోబోటిక్స్‌పైన తేజేశ్వ, దయా అవగాహన కల్పించారు. విద్యార్థులతో కొన్ని మోడల్స్ తయారు చేయించారు. కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ ప్రతినిధులు విష్ణు, బాబూరావు, నారాయణ, సంస్థ సమన్వయకర్త రాపేట రామారావు, సభ్యులు పాల్గొన్నారు.